నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, బుధవారం 29 జనవరి 2025 | KAMAREDDY

# అధికారంలో లేకున్నా అభివృద్ధికి కృషిచేస్తా..

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి
- వేల్పూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మోర్తాడ్, జనవరి 28: తాము అధికారంలో లేకున్నా, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. వేల్పూర్ మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో లేదని, అభివృద్ధి పనులకు నిధులు తీసుకురావడం కష్టమవుతున్న తరుణంలో అప్పటి రాజ్యసభ సభ్యుడు, స్నేహితుడు సంతోష్‌కుమార్‌ను అడగగానే వేల్పూర్ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు రూ.2కోట్ల పైచిలుకు నిధులు మంజూరు చేశారని తెలిపారు. వేల్పూర్ ప్రజల తరపున ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. అనంతరం రూ.30లక్షలతో ఇండోర్‌స్టేడియం, రూ.కోటి 20లక్షలతో ప్రైమరీస్కూల్ బిల్డింగ్, రూ.25లక్షలతో ఉన్నతపాఠశాల బిల్డింగ్, రూ.5లక్షలతో చర్చి కాంపౌండ్, రూ.20లక్షలతో ముదిరాజ్ సంఘ భవనం, రూ.2లక్షలతో ముస్లీమ్ అంజుమాన్ కమిటీ టాయిలెట్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.



వేల్పూర్‌లో పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

# నీళ్ల కోసం సెక్రటరీ నిర్బంధం

రాయకూర్ గ్రామ పంచాయతీ కార్యాలయానికి తాళం వేస్తున్న గ్రామస్తులు



- పట్టించుకోవడం లేదంటూ అధికారులపై ఆగ్రహం
- జీపీ కార్యాలయానికి తాళం వేసిన గ్రామస్తులు
- పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలు, బకెట్లతో నిరసన
- రుద్రూర్ మండలం రాయకూర్ గ్రామంలో ఘటన

రుద్రూర్, జనవరి 28: మండలంలోని రాయకూర్ గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందంటూ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. తాగునీటి సమస్యను అధికారులెవరూ పట్టించుకోవడంలేదని, వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయానికి బిందెలు, బకెట్లతో చేరుకొన్నారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ గ్రామ కార్యదర్శి శ్రీనివాస్‌ను పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. కార్యదర్శిని లోపల ఉంచి కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. పది నెలలుగా నీటి సమస్య ఉన్నదని, పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా తాత్కాలికంగా ఏదో బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. గ్రామంలో మొత్తం 14 మోటర్లు ఉన్నప్పటికీ ప్రస్తుతం నాలుగు మాత్రమే పనిచేస్తున్నాయన్నారు. వీటి ద్వారా ఇంద్రనగర్ కాలనీకి మాత్రమే నీరు సరఫరా అవుతున్నదన్నారు. అంబేద్కర్, ఛత్రపతి, ముస్లిం కాలనీల్లో నీటి సమస్య ఉన్నదని, రెండుమూడు రోజులకోసారి నీటి ట్యాంకర్‌ను పంపుతున్నారని మండిపడ్డారు. మోటర్లకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను విన్నవిస్తే డబ్బులు లేవంటూ చేతులెత్తేస్తున్నారని ఆరోపించారు. డబ్బులు లేవంటూ కార్యదర్శి నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేసి, నిర్బంధించారు. తాగునీటి సమస్యను పరిష్కరించే వరకూ ఆందోళన కొనసాగిస్తామని స్పష్టంచేశారు. నీటి సమస్యపై గ్రామ కార్యదర్శి శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. డబ్బులు లేవని, ఏం చేయమంటారంటూ సమాధానమిచ్చారు. ఆందోళన చేసిన వారిలో గ్రామస్తులు శ్యామ్, సాయిలు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శిని నిర్బంధించిన గ్రామస్తులు

# నమ్మించి.. వంచించి..

కాంగ్రెస్ సర్కార్‌పై రైతన్న భగ్గు

- మాట తప్పిన రేవంత్‌రెడ్డి
- రుణమాఫీ చేస్తామని మోసం చేసిండు
- వ్యవసాయరంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం
- అన్నదాతలకు అండగా బీఆర్‌ఎస్ పార్టీ
- ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాల్లో ఆత్మస్థైర్యం నింపిన బీఆర్‌ఎస్ అధ్యయన కమిటీ




### కాంగ్రెస్ సర్కార్‌కు బుద్ధి చెబుతాం

కాంగ్రెస్ చేసిన మోసపూరిత వాగ్దానాలకు ఆకర్షితులై కేసీఆర్‌ను వద్దనుకున్నారు. ఇప్పుడు అందరూ మళ్లీ కేసీఆర్ కావాలనుకుంటున్నరు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఇస్తమని హామీ ఇచ్చి రైతులను మోసం చేసింది. ఇప్పుడు వచ్చే సర్పంచ్ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డికి అందరం కలిసి బుద్ధి చెప్తాం.

-ప్రసాద్, రైతు, బాల్కొండ



### ఏక కాలంలో రుణమాఫీ చేయాలి

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులందరికీ ఏకకాలంలో రుణమాఫీ చేయాలి. రుణమాఫీ కూడా బ్యాంకులో ఎంత లోన్ ఉన్నా సంబంధం లేకుండా రూ. రెండు లక్షల రుణమాఫీ చేయాలి. ఎన్నికల్లో రైతులకిచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలి.

- ఎనుగందుల శ్రీనివాస్, రైతు, ఇత్వార్‌పేట్, బాల్కొండ మండలం



### కేసీఆర్ కంటికి రెప్ప లాగా కాపాడిండు

కేసీఆర్ సారు రైతును కంటికి రెప్పలా కాపు కాసిండు. ఠంచన్‌గా రైతుబంధు డబ్బులు అందుతుండే. వ్యవసాయానికి నిరంతరంగా కరెంట్, ఎరువులు కూడా సకాలంలో ఇచ్చిండు.


-కుమ్మరి సాయన్న, రైతు, బుస్సాపూర్



### మళ్లీ కరెంట్ కష్టాలు మొదలైనయ్

బాల్కొండ, జనవరి 28: పదేండ్ల కేసీఆర్ పాలనలో ఏ ఒక్కరోజు కూడా కరెంట్ కష్టాలు లేకుండె. కానీ ఇప్పుడు రేవంత్‌రెడ్డి సర్కార్ వచ్చాక కరెంట్ సరిగా ఉంటలేదు. ఏడాది నుంచి ఇబ్బందులుపడుతున్నం. ఎప్పుడు పోతదో తెలియని పరిస్థితి. కేసీఆర్ ప్రభుత్వానికి ముందు తెలంగాణ ఎట్ల ఉండేనో..ఇప్పుడు మళ్లీ అట్లనే మారిందని రైతులు బాధపడుతున్నారు. రానురాను ఇంకెట్లుంటదో కరెంట్ పరిస్థితి.


- ఫయాజ్, బాల్కొండ



### గతంలో రైతులకు అన్ని సౌకర్యాలుండేవి

బీఆర్‌ఎస్ హయాంలో పంట మొదలుపెట్టే సమయంలోనే అన్ని సౌకర్యాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచేది. పంట మొదలు పెట్టే సమయం నుంచి పంట కోతకు వచ్చే వరకు అధికారులు అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు ఇచ్చేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. అధికారులెవరూ పట్టించుకోవడంలేదు.

-కన్న పోశెట్టి, బాల్కొండ



### రైతుబంధు ఎగ్గొట్టిండ్రు..

కేసీఆర్ సారు ఉన్నప్పుడు రైతుబంధు అస్తుండే. ఎరువులకు, కూలీలకు, ఖర్చులకు సరిపోతుండే. కాంగ్రెసోళ్లు అచ్చుడుతోటి ఎగ్గొట్టిండ్రు. ఇప్పుడు రైతుబంధు రాక సేటు దగ్గరికి పొయి బాకీ తెచ్చుకుంటున్నం. పండించిన పంట ఈన్నే అమ్మాలంటుండ్రు. పండించినంక పోతే పంట మంచిగ లేదని ధర తక్కువ ఇస్తుండ్రు. అదే రైతుబంధు అస్తే బాకీ తెచ్చుకోకపోతుంటిమి కదా?

- మనోహర్‌రెడ్డి, రైతు, మోతె, వేల్పూర్ మండలం



### బ్యాంకులో మాకెంత రుణముంటే మీకెందుకు?

మోర్తాడ్, జనవరి 28: బ్యాంకులో నాకు రూ. 4లక్షల రుణం ఉన్నది. మాకు ఎంతలోన్ ఉంటే మీకెందుకు.. మీరు చేస్తమన్న రూ. రెండులక్షల రుణమాఫీ చేయండి. రూ. రెండులక్షల కన్నా ఎక్కువున్నదని కట్టుకోమంటూ మీరెందుకు చెబుతున్నరు. మీరు ఇస్తానన్న రూ. రెండులక్షలు ఇచ్చేస్తే మిగతా బాకీ సంగతి మేము, బ్యాంకు వాళ్లం చూసుకుంటం. ఇచ్చుడు చేతగాకపోతే కేసీఆర్‌లెక్క రూ. లక్ష అందరికిచ్చినా సంతోషపడుతుండిరి.

- రెంజర్ల మహేందర్, రైతు, కమ్మర్‌పల్లి



### కేసీఆర్ సర్కార్ కంటికి రెప్పల కాపాడుకున్నది..

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల ఆత్మహత్యలు లేకుండే. రైతులను కంటికి రెప్పలా కాపాడుకున్నరు. రైతుల అవసరాలను తెలుసుకొని ముందే అన్ని సౌకర్యాలు కల్పించారు. కరెంటు, ఎరువులు, రైతుబంధు డబ్బులు సమయానికి అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏ ఒక్కటి కూడా మంచి చేయడంలేదు. వ్యవసాయరంగాన్నే పట్టించుకుంటలేదు.

- ఉమాశంకర్, రైతు, కొత్తపల్లి



### రేవంత్‌రెడ్డిది పూటకోమాట..

సీఎం రేవంత్‌రెడ్డి పూటకోమాట చెబుతున్నారు. ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిండ్రు. ఓట్లు పడేదక ఒక మాట, ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంకో మాట మాట్లాడుతూ తప్పించుకొని తిరుగుతున్నరు. త్వరలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కచ్చితంగా గుణపాఠం చెబుతాం.

- రాము, బాల్కొండ



### సర్పంచ్ ఎన్నికల్లో బుద్ధి చెప్తాం..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ. రెండు లక్షల రుణమాఫీ చేస్తానని రేవంత్‌రెడ్డి గద్దెనెక్కిండు. కానీ రుణమాఫీ అందరికీ చేయలే. ఆయనను నమ్మిన రైతులు అప్పులు కట్టలేక ఆత్మహత్య చేసుకుంటున్నరు. ఇచ్చిన మాట నిలబెట్టుకోక తప్పుచేశాడు. వచ్చే సర్పంచ్ ఎన్నికల్లో రైతులందరం కలిసి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతాం.

-అనిల్, రైతు, సావెల్



మోర్తాడ్, జనవరి 28: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మి రైతులు మోసపోయారు. రైతుభరోసా కింద రూ.15వేలు ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు రూ.12వేలు మాత్రమే ఇస్తామని చెప్పి రైతులను వంచించారు. జిల్లాలో అరకొర మంది రైతులకు రుణమాఫీ చేసి రైతాంగాన్ని విస్మరించారని రైతులు మండిపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికాలంగా వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేయడంతో రైతులు ఆగమాగమవుతున్నారు. ఓ వైపు బ్యాంకర్ల వేధింపులు, మరోవైపు సాగుకు సకాలంలో పంటపెట్టుబడి సాయం అందక నానా కష్టాలు పడుతున్నారు. వ్యవసాయం భారమై, సర్కారు చేయూత కరువై రైతులు ఉమ్మడి జిల్లా లో బలవన్మరణాలకు పాల్పడుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం, సాయం అందక ఆవేదన చెందుతున్న అన్నదాతలకు బీఆర్‌ఎస్ రైతు అధ్యయన కమిటీ అండగా ఉంటామని భరోసా ఇచ్చింది. రైతు ఆత్మహత్యలు, వ్యవసాయ సంక్షోభంపై మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అధ్యక్షతన బీఆర్‌ఎస్ ఏర్పాటు చేసిన రైతు అధ్యయన కమిటీ ఈ నెల 25న నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం బుస్సాపూర్‌లో పర్యటించింది. రైతులతో ముఖాముఖి ఏర్పాటు చేసి వారి కష్ట, నష్టాలను తెలుసుకున్నది. అండగా ఉంటామని భరోసా ఇచ్చి, బాధిత కుటుంబాల్లో ఆత్మస్థైర్యం నింపింది. రైతుల పక్షాన పోరాడుతామని, రైతాంగం సమస్యలను పరిష్కరించేవరకూ రేవంత్ సర్కార్‌ను వదిలిపెట్టే ప్రసక్తేలేదని కమిటీ సభ్యులు స్పష్టం చేశారు.

# ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- ఫిబ్రవరి 3 నుంచి ప్రాక్టికల్స్, మార్చి 5 నుంచి థియరీ పరీక్షలు
- అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలి
- కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశం

కామారెడ్డి, జనవరి 28 : ఇంటర్ ప్రాక్టికల్, థియరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఫిబ్రవరి 3 నుంచి 22వ తేదీ వరకు 48 కేంద్రాల్లో ప్రాక్టికల్స్, మార్చి 5 నుంచి 25వ తేదీవరకు 38 కేంద్రాల్లో థియరీ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. థియరీ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్, ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి షేక్ సలాం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, డీఈవో రాజు, ఆర్టీసీ, వైద్యం, తపాలా, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులకు సూచనలు చేస్తున్న కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

## డబ్బులు ఇవ్వనందుకు..

# కన్నతల్లిని కడతేర్చిన తనయుడు

పొతంగల్ మండలం జల్లాపల్లి ఫారంలో ఘటన



మంగ్లీబాయి (ఫైల్)

పొతంగల్, జనవరి 28 : తాగుడికి డబ్బులు ఇవ్వనందుకు కన్నతల్లినే కడతేర్చాడు ఓ కర్కోటకుడు. మద్యానికి బానిసై నవమాసాలు మోసి పెద్దచేసిన తల్లినే అంతమొందించాడు. ఈ దారుణ ఘటన మండలంలోని జల్లాపల్లి ఫారంలో చోటుచేసుకోగా..ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు, స్థానికులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. జల్లాపల్లి ఫారానికి చెందిన నేనావత్ మంగ్లీబాయి (72)కి నలుగురు కుమారులు. ఇద్దరు కుమారులు గతంలో మరణించారు. మద్యానికి బానిసైన రెండో కుమారుడు రాములు డబ్బులు ఇవ్వాలంటూ తరచూ తన తల్లితో గొడవపడేవాడు. ఈ నెల 26వ తేదీన తల్లితో గొడవపడ్డాడు. ఆ రోజు నుంచి తల్లి మంగ్లీ బాయి కనబడకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో వెతకసాగారు. ఎంతకీ ఆచూకీ లభించకపోవడంతో రాములుపై అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు నిలదీయగా, హత్య చేసి చెరువు పక్కన ఉన్న కుంటలో పడేసినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం బోధన్ దవాఖానకు తరలించారు. తల్లి వద్ద ఉన్న డబ్బులు, వెండి ఆభరణాల కోసమే రాములు హత్య చేశాడని మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

# 'యూపీఎస్'పై నిరసనలు



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యూపీఎస్ (యూనిఫైడ్ పెన్షన్ స్కీం) విధానాన్ని రద్దుచేయాలని కోరుతూ ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో ఉపాధ్యాయులు మంగళవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో యూపీఎస్ విధానానికి సంబంధించిన ప్రతులను దహనం చేశారు. యూపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు.

లింగంపేట మండలం ఐలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో యూపీఎస్ ప్రతులను దహనం చేస్తున్న ఉపాధ్యాయులు